క్లుప్తంగా

ప్రమాదకరంగా రహదారి మధ్యలో మట్టి కుప్ప



రహదారి మధ్యలో మట్టికుప్ప

ఏయూక్యాంపస్: స్థానిక చినవాల్తేరు నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి ఎదురుగా రహదారిపై నీటి లీకేజీపై సాక్షి ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. వెంటనే సమస్యను గుర్తించి లీకేజీని అరికట్టారు. అయితే అదే సమయంలో తవ్విన మట్టిని కుప్పగా అక్కడే వదిలేశారు. దీంతో రాత్రివేళలలో ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఇది ఇబ్బందికరంగా మారింది. స్పీడ్ బ్రేకర్‌కు ఆనుకుని ఉన్న మట్టి కుప్పను రాత్రివేళల్లో వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మట్టికుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు



డస్ట్‌బిన్ నిండి రహదారిపై వ్యర్థాలు

ఏయూక్యాంపస్: పెదవాల్తేరు నుంచి లాసన్స్ బే కాలనీకి వెళ్లే మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. నిత్యం డస్ట్‌బిన్ నిండిపోవడం, వ్యర్థాలు రహదారి నిండా వ్యాపించడం పరిపాటిగా మారింది. దీనికితోడు పశువులు సైతం రహదారిపై తిష్టవేస్తున్నాయి. ఈ మార్గంలో వెళ్లాలంటేనే దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్య సిబ్బంది స్పందించి వ్యర్థాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్



ఆసక్తిగా కథ వింటున్న పిల్లలు

సీతంపేట : విశాఖపట్నం పౌర గ్రంథాలయం, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా లైబ్రరీ మియావాకీ సెంటర్‌లో నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం చిన్నారులను ఆకట్టుకునేలా ఉత్సాహంగా సాగింది. చందమామ కథ వ్యవస్థాపకురాలు శ్రీకరుణ ఆకర్షణీయమైన కథలు, సృజనాత్మక అంశాలతో పిల్లలను ఉర్రూత లూగించారు. 'ది హ్యాట్ సెల్లర్ అండ్ ది మంకీస్' కథను, పంచతంత్రంలోని 'ఒక కాలం' కథను టాయ్స్‌తో చక్కగా వివరించారు. అలాగే మంచితనం యొక్క బలం, స్నేహం, సమస్యల నుంచి పరిష్కారం కనుగొనే 'ది బేబీ ఎలిఫెంట్ అండ్ ది బన్నీ రాబిట్' నీతి కథను బోధించారు. పిల్లలను ఆకట్టుకునేలా తోలు బొమ్మలు, టోపీలు ఉపయోగించి సృజనాత్మకంగా కథలు బోధించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పునర్వినియోగం, రీసైక్లింగ్ ప్రాముఖ్యత వివరించేలా ది క్లీవర్ టైలర్ జానపద కథ పిల్లలను ఆలోచింపజేసింది.

శ్రీవారి సన్నిధిలో సామూహిక పారాయణం



పారాయణం నిర్వహిస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో ఆదివారం ఉదయం ఎండాడకు చెందిన రామలక్ష్మి బృందం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ధనుర్మాస సందర్భంగా తమ సభ్యులచే ఈ పారాయణం నిర్వహించామని తెలిపారు. అదే విధంగా సెలవు రోజు కావడంతో శ్రీవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.



శ్రీకాంత్‌నగర్ రోడ్డులో నిలిపిన ట్రావెల్ బస్సులు

పార్కింగ్ ఇష్టారాజ్యం

- శ్రీకాంత్‌నగర్ రోడ్డులో ట్రావెల్ బస్సుల నిలుపుదల
- వాటితో తరచూ ప్రమాదాలు
- ఆ మార్గంలో రాకపోకలకు హడలిపోతున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న అధికారులు, పోలీసులు

ఆరిలోవ :

రోడ్లు విశాలంగా ఉంటే వాహన చోదకులకు సౌఖ్యంగా ఉంటుంది. కానీ కొన్నిచోట్ల విస్తరించిన రోడ్లు కొందరికి అనధికారిక పార్కింగ్ కోసం ఉపయోగపడుతున్నాయి. నగరవాసుల వాహనాల రాకపోకలకు వీలుగా జీవీఎంసీ రూ.కోట్లు ఖర్చుచేసి విస్తరిస్తున్న రోడ్లు అనధికారిక పార్కింగ్ స్థలాలుగా మారుతున్నాయి. అలా పార్కింగ్ చేస్తున్న వాహనాలు ప్రమాదాలకు కారణమవుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. జీవీఎంసీ 12వ వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ రోడ్డు ట్రావెల్ బస్సుల పార్కింగ్ స్థలంగా మారింది. రోజూ పదుల సంఖ్యలో బస్సులను ఈ రోడ్డులో పార్కింగ్ చేస్తున్నారు. పలు సంస్థలకు సంబంధించిన ట్రావెల్ బస్సులు రోజూ నగరం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్లి తిరిగి వచ్చిన తర్వాత రాత్రి వేళ ఇక్కడకు తీసుకొస్తున్నారు. వాటిని తీసుకొచ్చి పార్కింగ్ చేసేటప్పుడు, తిరిగి బయటకు వెళ్తున్నప్పుడు ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి.



ఇటీవల శ్రీకాంత్‌నగర్‌లో వీఎల్ ట్రావెల్స్ బస్ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

పార్కింగ్‌తో ఇరుకుగా డబుల్ రోడ్డు

శ్రీకాంత్‌నగర్‌లో గెడ్డను ఆనుకుని డబుల్ రోడ్డు ఉంది. ఆరిలోవ కాలనీ, ముడసర్లోవ ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ వరుసగా పదుల సంఖ్యలో నిలుపుతున్న ట్రావెల్ బస్సులతో రోడ్డు ఇరుకుగా మారడంతో వాహన చోదకులకు ఇబ్బంది కలుగుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతుడటంతో స్థానికులు భయపడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద శబ్దాలతో హారన్లు కొడుతూ ఇక్కడకు బస్సు లు తీసుకొచ్చి నిలుపుతున్నారని స్థానికులు అంటున్నా రు. కొన్నింటిని వేకువజామునే తీస్తుండడంతో పెద్ద పెద్ద శబ్దాలకు నిద్ర పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆరిలోవ పోలీసులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, పోలీసులు స్పందించి శ్రీకాంత్‌నగర్ రోడ్డుపై ట్రావెల్ బస్‌లు నిలపకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలతో భయాందోళన

నాలుగు రోజుల క్రితం (2024 డిసెంబర్ 31 అర్ధరాత్రి) వీఎల్ ట్రావెల్స్ బస్ ఈ రోడ్డులో నిలుపుతుండగా అదుపుతప్పి డబుల్ రోడ్డు డివైడర్‌లో ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ స్తంభం విరిగిపోయి రెండు ముక్కలైంది. ఆ ప్రాంతంలో విద్యుత్ లైన్‌కు సంబంధించిన తీగలు తెగిపోయాయి. మరుసటి రోజు ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ విభాగం అధికారులు విరిగిన స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. తెగిపోయిన విద్యుత్ తీగలను పునరుద్ధరించారు. దానివల్ల ఒక రోజంతా ఆ ప్రాంతంలో కరెంట్ లేకుండా పోయింది. స్తంభాన్ని బస్సు ఢీకొట్టిన సమయంలో ఎవరూ రోడ్డుపై లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. లేకుంటే ఎంతో మంది ప్రాణాలకు అపాయం వాటిల్లేది. ఈ ఘటనపై బస్సు యజమానిపై ఆరిలోవ పోలీసులకు స్థానిక సబ్ స్టేషన్ ఏఈ ఫిర్యాదు చేశారు. దీనివల్ల సుమారు రూ.50 వేలకు పైగా ఖర్చు జరిగిననట్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు.

- ఏడాది క్రితం ఓ రోజు ఉదయం ట్రావెల్ బస్ తీస్తుండగా అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. దీంతో డివైడర్ గోడలు విరిగిపోయాయి. అక్కడ ఉన్న పచ్చని మొక్కలన్నీ నాశనమయ్యాయి. ఆ సమయంలోనూ జనసంచారం, వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇలాంటి నిత్యం ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నాయి.

మూడేళ్ల క్రితం వృద్ధురాలి మృతి

శ్రీకాంత్‌నగర్ రోడ్డులో నిలిపిన బస్‌ను మూడేళ్ల క్రితం ఓ రోజు తెల్లవారుజామున నగరంలోకి తీసుకెళ్లేందుకు డ్రైవర్ టర్న్ వేశాడు. ఆ సమయంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి (యాచకురాలు) మీదకు ఆ బస్ వెనుక టైర్లు ఎక్కేశాయి. దీంతో ఆమె సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. దీనిపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే పోలీసులు ఆ వృద్ధురాలిని అనాథ శవమని దహనకాండ జరిపించి కేసు నీరుగార్చేశారు. ట్రావెల్ బస్ యజమానికి పుష్కలంగా సహాయ సహకారాలు అందించారనే ఆరోపణలు ఆ సమయంలో గుప్పుమన్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రమాదాల నివారణకు ట్రావెల్ బస్సుల పార్కింగ్‌ను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పార్వతినగర్ గెడ్డ పక్కన రోడ్డులో నిలిపిన ట్రావెల్ బస్సులు

క్రీడాకారుల విజయాల వెనుక తల్లిదండ్రుల కృషి



పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

ఏయూక్యాంపస్: క్రీడాకారుల ప్రతీ విజయం వెనుక తల్లిదండ్రుల కృషి దాగుంటుందని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. ఆదివారం సాయంత్రం వీఎంఆర్‌డీఏ పార్క్‌లో జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల విజేతలు, కోచ్‌లకు నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ చిన్నారులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతూ, వారిని అనునిత్యం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందిస్తున్నానన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. వీరంతా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అనంతరం పతకాలు సాధించిన క్రీడాకారులు, వారికి శిక్షణ అందించిన కోచ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ జె.సుధాకర్ రెడ్డి, సీఈవో భగీరథ్ కుమార్, జనరల్ సెక్రటరీ ఐ.థామస్, జిల్లా కార్యదర్శి శీలం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ లక్ష్మణరావుకు సత్కారం

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) కెమికల్ హెడ్‌గా పదవీ విరమణ చేసిన డాక్టర్ బీవీ లక్ష్మణరావును ఆదివారం సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.సత్యనారాయణ అతిథిగా పాల్గొని లక్ష్మణరావును సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన లక్ష్మణరావు మాస్టారును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

విశాఖవ్యాలీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆరిలోవ: విశాఖ వ్యాలీ పాఠశాలలో ఆదివారం మిలాన్-2025 పేరుతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1968 నుంచి 2023 సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులంతా ఒకేచోట కలిశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరిప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన వీరి కలయికకు అదే పాఠశాల వేదిక కావడం విశేషం. నగరంలో ఉన్న కొందరు పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహణకు నడుంబిగించారు. దీంతో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పాఠశాలలో సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకొన్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో 3,800 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. వీరికి పూర్వవిద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు. చదువుకొన్న పాఠశాలలోనే పూర్వ విద్యార్థులంతా కలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

సందడిగా సంక్రాంతి సంబరాలు

ఆరిలోవ: ఆరిలోవలో ఆదివారం సంక్రాంతి సంబరాలు సందడిగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర సంగీత జానపద కళాపీఠం ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతం టీవీసీ పాయింట్ వద్ద సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రెట్టి భగవాన్‌దాస్, పీఠం కమిటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాలకు చెందిన కళాకారులను ఇక్కడకు తీసుకువచ్చారు. ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, టీవీసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం రావడంతో వారంకు ముందే సంక్రాంతి వచ్చినట్లయింది. కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, ఏకపాత్రాభినయం, గిరిజన కోలాటం, ధింసా నృత్యం, జముకుల కథ, సన్నాయి మేళం, రాజమ్మ ఆట, నాగిని డ్యాన్స్, తుడుము మేళం, ఒడిశా గిరిజన సంస్కృతి, చెంచు నాటకం, జానపద పాటలు, జానపద నృత్యాలు, గొల్ల పాటలు, సామాజిక పాటలు తదితర కళలను విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాపీఠం కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు కళాకారులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.



సన్నాయి మేళం వాయిస్తున్న కళాకారులు



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారి

గిరిజన ఉద్యోగుల సంఘం ప్రమాణ స్వీకారం

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవనంలో జరిగింది. సంఘ సభ్యుల సమక్షంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు సొనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. సంఘ సభ్యులైన గిరిజన ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో సేవలు అందిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ, రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

'వాహనమిత్ర' అమలుకు డిమాండ్

సీతంపేట : ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రామాటాకీస్ కూడలి వద్ద శ్రీరామ ఆటో స్టాండ్ డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాహన మిత్ర పథకంలో భాగంగా ఏడాదికి రూ.15వేలు వెంటనే అందజేయాలని, జీవో నంబర్లు 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పింఛన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఆటో డ్రైవర్లకు భరోసా కల్పించాలని కోరారు. నగర పరిధిలో ఉబర్, ఓలా, రాపిడో వాహనాలు నిషేధించి ఆటో డ్రైవర్ల ఉపాధికి భద్రత కల్పించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గిస్తామన్న హామీ పదేళ్లుగా అధికారంలో ఉన్నా నెరవేర్చలేదన్నారు. 2023 నూతన మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేసి, పెట్రోల్, డీజిల్ ధరలు జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్.యొహాన్, పి.శ్రీనివాసు, ఎ.దుర్గాప్రసాద్, పైడిరెడ్డి చిన్న రెడ్డి, ఎస్.రాము, ఎ.సురేష్, కె.శివ పాల్గొన్నారు.



రామాటాకీస్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కూటమి రంగు బయట పడింది

వైఎస్సార్‌టీయూ ప్రధాన కార్యదర్శి పిట్టారెడ్డి

అగనంపూడి: అధికారంలోకి వచ్చిన ఆరుమాసాల్లో కూటమి ప్రభుత్వం అసలు స్వరూపం బయటపడిందని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆదివారం వారు మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ అధికారం ఇస్తే ప్రైవేటీకరణ అడ్డుకుంటామని చెప్పి నేడు కనీసం నోరుమెదపకపోవడంతో వీరి బాగోతం ప్రజలకు అర్థం అయిందన్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరడం మానేసి మిట్టల్ నిర్మిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు లైసెన్స్, ఇనుప గనులు కేటాయించాలని ప్రధాని మోదీని కోరడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు విశాఖలో అడుగు పెట్టే హక్కు ప్రధానికి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, గొందేశి ప్రభాకర్ రెడ్డి, మద్ది అప్పలరాజు, బైరెడ్డి అప్పలరెడ్డి, గొందేశి మంగరాజు, బీఎంకె రాజు, అప్పారావు, సత్యనారాయణ, గోవింద్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి

సాయంకాలం.. సాగరతీరం







ఏయూక్యాంపస్: సాయంత్రం సాగర తీరంలో నగరవాసులు సరదా...సరదాగా గడిపారు. కొత్త సంవత్సరంలో తొలి ఆదివారం స్నేహితులు, కుటుంబ సభ్యులతో బీచ్‌లో సందడి చేశారు. ఆర్‌కే బీచ్ నుంచి రుషికొండ తీరం వరకు సాగర తీరం సందడిగా మారింది. చిన్నారులు ఆర్‌కే బీచ్‌లో గుర్రాలపై స్వారీ, రంగుల రాట్నం, ఇసుకలో ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. సముద్ర తీరంలో రాళ్లపై యువత సెల్ఫీలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో ఫొటోలు తీసుకుంటూ, ఆదివారం ఎంజాయ్ చేశారు. భారీగా నగరవాసులు, పర్యాటకులు తీరానికి రావడంతో సందడి నెలకొంది.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



అలరించిన వినోదాల విందు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం వినోదాల విందు పేరిట నిర్వహించిన కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, నాయుడు, పోర్ట్ శేషు, ఇమంది ఈశ్వరరావు, రమేష్, శివ జ్యోతి, సీత, వెంకటేశ్వరరావు, పుష్యమి, సంధ్యా ప్రియదర్శిని ప్రదర్శించిన స్కిట్స్, చెప్పిన జోక్స్ కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో జ్యోతి ప్రజ్వలన, అకౌంటెంట్ పోస్టు, ఎస్ఐ కానిస్టేబుల్, సుబ్బారావు పెళ్లి, సన్మానం, డాక్టర్ పేషెంట్, అమ్మాయి చుట్టూ, బెల్జియం అద్దం, మూడు మాత్రలు, పెళ్లి చూపులు, సేవ్ ఫుడ్ కామెడీ స్కిట్స్ నవ్వులు పండించాయి. ముందుగా హరిహర నృత్య నికేతన్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు అనూష, అనన్య, శరణ్య ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్ అలరించింది. కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, వి.వి.కృష్ణంరాజు, మాల్యాద్రి, శివకుమార్ కళాకారులను సత్కరించారు.



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ కళాకారులు